
# దైవనిర్ణయమా?

## పి. గణపతిశాస్త్రి




**సుందరమ్మ** పణుగుడుతోబాట దులపడం మొదలు పెట్టిందంటే ఆ నోటి కిక అడ్డూ, ఆపూ ఉండవు. కాంతారావు ఆజానుబాహువు. మంచి బలిష్ఠుడు! ఎటువంటి గడ్డు మనుష్యునైనా ఇట్టే ఎదుర్కొని, ధైర్యంగా పోరాడి జయించగలడు! ఎంతటి బలవంతులనైనా ఇట్టే ఎదిరించి చిత్తుగా వోడించగలడు! కాని, అతడికి భార్య సుందరమ్మ పణుగుడు వినబడీ వినబడగానే విపరీతమయిన కంగారు, వణుకు, దడ పుట్టుకు వస్తాయి.

ఆ ధోరణి గమనిస్తూ, వైధవ్యం వచ్చినప్పటి నుంచి ఇంట్లోనే ఉండిపోయిన అతని అక్క మీనాక్షి, ఆమె కొడుకు గోపాలరావు వింటూనూ విభ్రాంతపడుతూంటారు. తమ్ముడికి వినబడీ వినబడనట్టుగా మీనాక్షి తరచుగా ఇలా గొణుక్కుంటూ ఉంటుంది.

"ఇదేమి విడ్డూరమమ్మా! సొంతంగా ధాన్యం వ్యాపారం ప్రారంభించి, గొప్పగా ఆస్తి పాస్తులు, పేరు ప్రతిష్ఠలు సంపాదించుకున్న మా తమ్ముడికి—భార్య కాస్త నోరు తెరిస్తే కంగారు బయలుదేరుతుంది! మగాడయి పుట్టేంతరవాత ఆడదాని నోటికి జడిసి ఇలాగ అగ్గగ్గలాడిపోవడం నే నెక్కడా చూడలేదమ్మా!" అలాగంటూనే ఆవిడ బుగ్గలు నొక్కుకుంటూ ఉంటుంది.

కాంతారావుకి మొదటి నుంచీ చిన్న చిన్న ఉద్యోగాలన్నా, ఉద్యోగస్థులన్నా అంతగా గౌరవం లేదు. సొమ్ము ముమ్మరంగా గడించాలంటే వ్యాపారం ఒక్కటే ఏకైక సాధనం అని అతని గట్టి నమ్మిక! కనుకనే తాను కష్టపడి బియ్యే గట్టెక్కినా, మరి గుమాస్తాల వంటి ఉద్యోగాల మాటే తలపెట్టక కొద్దిపాటి మొత్తంతో వెల్లూరులో ధాన్యం వ్యాపారంలోకి దిగాడు.

మనిషి చాలా చురుకయినవాడు. మంచి మెళకువతో, ముందు చూపుతో వ్యవహరించగలడు. అయితే అన్నమాట తప్పిన మనుషులతో అతని కేమాత్రమూ పడదు. కాంతారావు క్రమక్రమంగా ధాన్యం వ్యాపారంతో బాగా పైకి వచ్చాడు. అతనికి మొట్టమొదట మున్న దా

పిల్లలు, ఆ తరువాత ఇద్దరు మగ పిల్లలు కలిగారు.

పెద్ద పిల్ల రమణి వివాహ వ్యవహారం తలెత్తేసరికి ఆ ఇంట్లో పెద్ద రభస మొదలైంది. కాంతారావు పిల్లలందరూ గట్టి ఆరుపాళ్ళలలో పెరిగి, చదువు సంధ్యలలో బుద్ధిమంతులు అనిపించుకున్నారు. రమణి ఇంటర్ దాటి బియ్యే అడుగుపెట్టినా, నేటి కాలపు ఆడపిల్లల విద్దూరపు ధోరణులేవీ అలవాటు చేసుకోలేదు. తన చదువుసంధ్యలేమో, తానేమో—అంతే!

చిన్నతనంలో తండ్రి పోయినప్పటి నుంచి గోపాలరావు మేనమామ ఇంట్లో ఉండి కొంచెం మంచి మార్కులతో బియ్యే పాసయ్యాడు. అతని కింక వేరే ఆస్తిపాస్తులేవీ లేవు! ఎప్పటికైనా తన పలుకుబడి ఉపయోగించి మేనమామ తన కెక్కడయినా ఒక చిన్న ఉద్యోగం వేయించకపోడని అతని ఆలోచన!

మీనాక్షి అన్నా, గోపాలరావన్నా సుందరమ్మకి బొత్తిగా కిట్టేది కాదు. దానికి చాలావరకు మీనాక్షే కారణమని చెప్పాలి. సుందరమ్మ కాపురానికి వచ్చిన కొత్తలో ఆ ఇంటి పెత్తనం అంతా మీనాక్షిదే! మొట్టమొదట ఆమె సుందరమ్మ మీద మరీ తిరుగులేని అధికారం చెలాయించింది!

ఎంతో ఇష్టపడి ఏదన్నా కాస్త సొగసయిన చీర కొనుక్కుని కట్టుకుంటే చాలు—మీనాక్షి రుసరుస లారంభించేది!

''సినిమా స్టారులాగ ఆ వేషమేమిటే? ఆ విరగబాటేమిటే? కాకపోయినా, ఈ మధ్యన వస్తున్న పాడు సినిమాలు చూశాక ఆడవాళ్ళందరికీ పగులు పోతున్నాయి!' 'అంటూ సుందరమ్మతో ప్రారంభించి ఈనాటి సినిమాలన్నింటి మీద అదే పనిగా దుమ్మెత్తిపోస్తూ ఉండేది. సుందరమ్మ ఏ పని చేసినా—చీటికీ మాటికీ వంకలు దిద్దుతూ సాధిస్తూండేది. క్రమక్రమంగా సుందరమ్మకీ, మీనాక్షికీ మధ్యన ఎడమొహాలు, పెడమొహాలు, చీదరింపులు, సాధింపులు ప్రారంభమయ్యాయి.

ఆ సమయంలో కాంతారావు అక్కనిగాని, భార్యనిగాని ఏమీ అనలేక, మొత్తం మీద ఇద్దరినీ శాంతింపజెయ్యడానికి ప్రయత్నించేవాడు. ఆ ధోరణే ఆ ఇద్దరిలోను ఒకరొకరి మీద అక్కసు మరింతగా పెంచుతూండేది.

అవసరమయితే ఇరవై వేల కట్నమైనా గుమ్మరించి రమణి పెళ్ళి గొప్పగా జరిపించాలని సుందరమ్మ కలలు కంటూ ఉండేది. కాని, అంతవరకు ఊహించలేక

**బహుశా ఇది శ్రీ పిలకా గణపతిశాస్త్రిగారి చివరి కథ. శ్రీ శాస్త్రిగారు రెండు తరాల తెలుగు సాహితీ వారధి. సంస్కృతాంధ్రాంగ్ల భాషలలో పండితులు. బెంగాలీ, ఫ్రెంచి భాషలు క్షుణ్ణంగా నేర్చినవారు. వీణా వాదనంలోను సెబాష్ అనిపించుకున్న సంగీత సరస్వతి. వీరు ఎన్నో కథలు, నవలలు, పద్యాలు, పాటలు రాశారు. 'విశాల నేత్రాలు', 'గృహిణి' ప్రసిద్ధ నవలలు. 'ప్రాచీన గాథాలహరి', 'దేవీ భాగవతం' వెలలేని సాహితీ ముత్యాలు. ఎన్నిరాసినా శాస్త్రిగారు మొదటి నుండి జర్నలిస్టు. కొంత కాలం ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక సంపాదక వర్గంలో పనిచేసి, పదవీ విరమణ చేశారు. ఆ తర్వాత కొన్ని సినిమాలకు పాటలు రాశారు. జనవరి 3 న స్వర్గస్థులైనారు.**



కాంతారావు లోలోపల కొంత ఆటపటాయించేవాడు. అయినా భార్య మాటకు ఎదురు చెప్పలేక, ఏదయినా మంచి సంబంధం తీసుకు వస్తే, సుందరమ్మ దానికెన్నో వంకలు దిద్దుతూ ఆక్షేపించేది.

అయినా ఇరవై వేల దాకా కట్నంతో సయినా కాంతారావు కొన్ని మంచి సంబంధాలు చూసి, ఇద్దరు ముగ్గురు వరుల ఫోటోలు ఇళ్ళలికి, అమ్మాయికి పంపించాడు. సుందరమ్మ యథా ప్రకారంగా తనకు అలవాటయిన పాత పాటే పాడింది.

రమణి మాత్రం కొంచెం తలవంచుకుని ''అమ్మా, మీరు కలిసి ఏ సంబంధం నిర్ణయించినా నాకది నచ్చినట్లే, నాన్నా! మీ ఇష్టమే నా ఇష్టం'' అని నెమ్మదిగా సణుగుతూ ఉండేది. అంతే గాని, ఒక్కనాడు కూడా తన స్వంత నిర్ణయమేది నిష్కర్షగా వెల్లడించలేదు.

కొత్త సంబంధాల అన్వేషణలో ప్రాణం విసిగి వేసారిన కాంతారావు మనస్సులో ఒకనాడు ఈ ఆలోచన మెరుపులా దూసుకుపోయింది.

ఎలాగ ఇరవై వేలదాకా కట్నం పోసి తీరాలి! ఆ పైన లాంఛనాలకని, విందులకని, వినోదాలకని, మొత్తం మీద పదివేలదాకా హరించుకుపోతాయి.

ఈ సొమ్మంతా నిలువ చేసి, గోపాలరావుచేత ధాన్యం వ్యాపారం పెట్టిస్తే ఎంతయినా బాగుంటుంది. నలుగురూ మెచ్చిస్తారు! రమణిని గోపాలరావుకిచ్చి వివాహం జరిపిస్తే ఈడూ, జోడూ బాగుంటుంది. ఇద్దరూ చిలకాగోరింకల్లా ఉంటారు. ఎందుకొచ్చిన వీ పాడు పై సంబంధాలు! ?

అయితే ఆ ఆలోచన భార్య దగ్గర బయట పెట్టడానికి కూడా అతనికి ధైర్యం చాలలేదు. కాని, ఆ తరువాత ఒకనాటి రాత్రి కాంతారావు తన ధైర్యం అంతా చిక్కబట్టుకుని ఇల్లాలికేసి చూడకుండానే మెల్లగా తన ఆలోచన వెల్లడించాడు. ఆ మాట వింటూనే సుందరమ్మ గుండెల్లో గుమ్మరించిన అగ్గిలా భగ్గుమని పైకి లేచింది!

''అయ్యయ్యో! ఏమిటీ ఆలోచనండీ? ఆనాటి కానాటికి మీ కిలాంటి పెడ బుద్ధులు పుట్టుకు వస్తున్నాయేమండీ? ఆ బొంతకాకి నోటికి పిక్కేసిలాంటి దొండపండందించాలని చూస్తున్నారేమిటండీ!'' అంటూ అదే పనిగా దుయ్యడం ప్రారంభించింది. గోపాలరావు పిశాచికి పల్లెటివాడు కాడు. రవంత చామనఛాయ మాత్రమే! అయితే, మంచి కనుముక్కు తీరున్నవాడు కాని, ఆ ఇల్లాలి కంటికి పట్టి బొంత కాకిలా కనిపించాడంతే!

ఆ గొడవతో ఆనాటి రాత్రి ఆ ఇంటిల్లిపాదికీ కంటికొక్క కునుకయినా పట్టలేదు. సుందరమ్మ భర్తననేక విధాల దుయ్యబట్టడం మొదలుపెట్టింది. ఆ క్షణం మొదలుకొని కాంతారావు భార్య దగ్గర మరి గోపాలరావు మాట తలపెట్టలేదు. వేరే పై సంబంధాలే వెదకడం ప్రారంభించాడు.

అయినా, సుందరమ్మ అంతర్యంలో ఏదో అనుమానం పట్టుకుని పీడించసాగింది. అందువల్ల తన ఆడబడుచునిగాని, ఆమె కొడుకుని గాని తన ఇంటి పట్టున ఉండనియ్యకూడదని గట్టిగా నిశ్చయించుకుంది. అందుచేత మీనాక్షి కాళ్ళ కింద, గోపాలరావు కాళ్ళ కింద మాటి మాటికి చింత నిప్పులు గుమ్మరించడం ప్రారంభించింది. అలాగ మరి కొన్నాళ్ళు గడిచేసరికి మీనాక్షి ఇక భరించలేకపోయింది.

''నాయనా కాంతారావూ! నేనింక ప్రతిరోజూ ఈ నరకయాతన, ఈ కత్తి కోత భరించలేనురా! నా కొడుక్కి ఎక్కడన్నా ఒక్కచిన్న ఉద్యోగం వేయిస్తే, ఈ జన్మలో నువ్వు చేసిన మేలు మరిచిపోలేనురా! చిన్నప్పటి నుంచి నన్ను, నా కొడుకును కడుపులో పెట్టుకుని ఆదరించావురా'' అంటూ బుడిబుడి దీర్ఘా లారంభించింది.

ఆ పైన కాంతారావుకి తన సంసారం అంతా ప్రత్యక్ష నరకంలా కనిపించింది. ఎలాగో అలాగ నానా తంటాలు పడి గోపాలానికి నెల్లూరులోనే ఒక బాంకిలో తాత్కాలికంగా ఒకఉద్యోగం వేయించాడు. ఆ క్లర్కు ఉద్యోగంవల్ల గోపాలరావుకి నెలకు ఏడెనిమిది వందల దాకా జీతం ముట్టింది. మరి కొన్నాళ్ళలోనే మీనాక్షి తన కొడుకుతో వేరొక అద్దె ఇంట్లో కాపరం పెట్టింది.

పైపైకి తన తప్పేమి లేనట్టు అభినయించినా, సుందరమ్మ అమ్మయ్య అనుకుని తన తల తడిమి చూసుకుంది. అయితే కూతురు పెళ్ళి తలపెట్టగానే చిన్నప్పటి నుంచీ తనకెన్నో విధాల ఆసరాగా ఉన్న అక్కగారు కొడుకుతో కలిసి వేరొక ఇంటికి వెళ్ళిపోగానే కాంతారావుకి ఇరుగుపొరుగులందరిలోను తల కొట్టివేసినట్టు అనిపించింది.

'మనమేం చెయ్యగలం—అంతా ఆ దైవ నిర్ణయమే! అది ఏలాగుంటే అన్నీ అలాగే సాగిపోతాయి అంతే!' అనుకుని తనలో తాను సమాధానపడ్డాడు.

కొంతమంది తాము చేజేతులా

చేసినవాటి కన్నింటికి ఆ దైవమే కారణమని సమర్థించుకుంటూంటారు. అంతేగాని, అందులో తమ జవాబుదారీ కాని, చేతకానితనంకానీ ఏమాత్రమూ లేవని సమాధానపడి ఆత్మవంచన చేస్తుంటూంటారు. కాంతారావు వ్యవహారంలో సరీ అలాగే జరిగింది. ఇల్లాలి పోరు కొంత అదుపులో పెట్టగలిగి ఉంటే అక్కా, కొడుకుతోబాటు వేరొక అద్దె ఇంట్లో తల దాచుకోవలసిన పరిస్థితి తల ఎత్తి ఉండేది కాదు. కాని, కాంతారావు అది అంతా దైవం నెత్తి మీదకే తోసి వేసి చేతులు దులుపుకున్నాడు.

మీనాక్షి ఆ ఇంటి నుంచి వెళ్ళిపోతూ తమ్ముడి ముందు కంట నీరు పెట్టుకుంది.

"చూడు బాబూ! శివుడి ఆజ్ఞ లేనిదే చీమయినా కుట్టదంటారు. ఇలాగ వెళ్ళిపోయినంతటి మాత్రాన నేను నీకు దూరం కాలేదురా! ఈ వూళ్ళోనే ఇంకో పేటలోనే ఉన్నానుగా! అప్పుడప్పుడు వచ్చి మా క్షేమ సమాచారాలు కనుక్కోవడం మరచిపోకు, నాయనా!"



ఫోటో-బి. నాగేశ్వరరావు

ఆ తరవాత కాంతారావు మళ్ళీ రెండు మూడు కొత్త సంబంధాలు తీసుకువచ్చాడు. రమణి తనకలవాటయిన పాత పాటే పాడింది. సుందరమ్మ ఆ కొత్త సంబంధాలకు కూడా వంకలు పెట్టడం మానలేదు! ఆ క్షణంలో కుమార్తె వివాహం వ్యవహారంలో కాంతారావు నవనాడులు కుంగిపోయాయి!

"ఇంక నే నీ సంబంధాలు వెతకలేను. నువ్వు నీ పుట్టింటివారితో కలిసి ఏదైనా మంచి సంబంధం కుదిరిస్తే దానికి నేను కూడా సరే అంటాను. అంతే! తీసుకు వచ్చిన ప్రతీదానికి నువ్విలాగ వంకలు పెడితే నేనేం జేసేది?"

ఆ పైన సుందరమ్మ తన పుట్టింటి వారివైపు నుంచి ఒక కొత్త సంబంధం తీసుకువచ్చింది. ఆమె కది అన్నివిధాలా బాగా నచ్చింది. వరుడు కాలేజీలో లెక్చరర్. వెయ్యి రూపాయలదాకా జీతం చేతికందుతుంది. అంతకన్న వేరే ఆస్తిపాస్తులేవీ లేవనే చెప్పాలి. పాతిక వేల రూపాయల దాకా కట్నం కావాలంటున్నారు. పైగా లాంచనాలు వగైరా ఉండనే ఉన్నాయి. కుర్రవాడు మొత్తం మీద బాగానే ఉంటాడు. చెప్పుకోదగ్గ ఆస్తిపాస్తులేవీ లేనందువల్ల అతనికి అంత కట్నం పొయ్యడం వట్టి దండుగ అని కాంతారావు పెదవి విరిచాడు.

కాని ఆ పెళ్ళి వ్యవహారంలో మధ్యవర్తి సుందరమ్మ గట్టిగా నచ్చజెప్పిన తరవాత కాంతారావు గత్యంతరం లేక దానికి అంగీకరించాడు. అయినా ఆ లెక్చరర్‌కి రమణి నచ్చవలసిన అవాంతరం ఒకటి మిగిలిపోయింది. వరుడికి వధువు నచ్చిన పిమ్మటే వివాహం స్థిరపడుతుంది అంతే!

అదృష్టవశాత్తూ ఆ వ్యవహారంకూడా చాలా సజావుగానే సాగిపోయింది. లెక్చరర్‌కి రమణి నచ్చింది. ఆ పైన అతని విషయంలో నీ అభిప్రాయమేమిటని సుందరమ్మ కుమార్తె నడిగింది. రమణి కాలి బొటన వేలితో నేల మీద రాస్తూ, "మీ ఇద్దరికి నచ్చితే నాకూ నచ్చినట్టే, అమ్మా!" అంటూ సన్నగా సణిగింది.

ఆ పైన త్వరలో శుభముహూర్తం పెట్టించితిరుపతిలోగానితిరుచానూరులోగాని వివాహం జరిపించాలని ఉభయపక్షాల వారు ఒకనిర్ణయానికి వచ్చారు. మొట్ట మొదటి శుభకార్యం తమ ఇంట్లో జరగాలని కాంతారావు పట్టుబట్టాడు. కాని తమకేదో మొక్కుబడి ఉన్నదని చెప్పి మగపెళ్ళివారు తమ మాట నెగ్గించుకున్నారు.

ఆ పై వారంలో ఒకనాటి రాత్రి పదకొండున్నర గంటల ప్రాంతంలో ఒక శుభముహూర్తం నిర్ణయించి మగపెళ్ళివారు ఆ సంగతి కాంతారావుకి తెలియజేశారు. అంతకంటే ముందు ఆ రాత్రి శుభ ముహూర్త మేదీ కుదరలేదా' అని అతడు మగపెళ్ళివారి పురోహితుణ్ణి ప్రశ్నించాడు. ఆ మరునాడు తెల్లవారే వేళ తప్ప ఇంకా మంచి ముహూర్తమేదీ లేదని ఆయన నీళ్ళు నమిలాడు. రవంతసేపు ఆలోచించి, కాంతారావు 'సరే' అని దానికి అంగీకరించాడు.

ఇక వివాహంనాటి రాత్రి లాంచనాలేమిటో, వాటి వివరాలేమిటో నిక్కచ్చిగా తేల్చి చెప్పవలసిందని కాంతారావు ఆ పెళ్ళి వ్యవహారంలో మధ్యవర్తిని పిలిచి అతి రహస్యంగా అడిగాడు. అతగాడు కలకలా నవ్వుతూ "అవి అంతటి పెద్ద లాంచనాలు కావనుకుంటాను బాబూ! అల్లుడు బులెట్ మోటారు సైకిలు, టి.వి. సెట్టు కావాలని ముచ్చట పడుతున్నాట్ట! అంతకన్న అతగాడేమీ కోరడు! మీరేమీ కంగారుపడకండి! ఇంత వైభవంగా వివాహం జరిపిస్తున్నారు! అవి మీకొక లెక్కా!" అంటూ మళ్ళీ నెమ్మదిగా నవ్వాడు.

ఆ మాటలు వినగానే కాంతారావు గుండెలో పిడుగులు పడ్డాయి. ఆ మోటారుసైకిలు, ఆ టి.వి. సెట్టు కలిసి సుమారు పదిహేనువేల దాకా దేకుతాయి! పెద్ద పిల్ల పెళ్ళికే తానంత మొత్తం గుమ్మరిస్తే ఇక మిగిలిన ఆడపిల్లల పెళ్ళిళ్ళ మాటేమిటి? అదీగాక, తీరా పెళ్ళి పీటల మీద కూర్చోబోయే ముందు బాగాఖరుకులో పెట్టి తన దగ్గర అంత సొమ్ము ఒక్కసారిగా రాబట్టాలని మగపెళ్ళివారు ఆలోచిస్తున్నారని గ్రహించడానికి కాంతారావుకి ఎంతోసేపు పట్టలేదు. అందుచేత తానంత మొత్తం లాంచనాల రూపంలో ఇవ్వలేనని ఆ మధ్యవర్తితో నిక్కచ్చి చెప్పేశాడు. అంతే కాదు. ఆ వ్యవహారం అంతా సుందరమ్మ చెవిని కూడా వేశాడు.

ఆమె అదంతా వింటూనే నిలువునా నిర్ఘాంతపడింది. ఇది స్వయం తాను దగ్గర ఉండి కుదిర్చిన సంబంధం. మగపెళ్ళివారు తన పుట్టింటివారికి బా కావలసినవారే! అయినా డబ్బు విషయంలో వారంత మోసగిస్తున్నారని గ్రహించగానే ఆమెకెంతో ఏహ్యభావం కలిగింది. అయినా మధ్యవర్తిని పిలిచి కాంతారావు ఇవ్వజూపిన అయిదువేల రూపాయల లాంచనాలకే అంగీకరించేట్టు చెయ్యవలసిందనిఅనేక విధాల బతిమాలుకుంది.

అతను కూడా శాయశక్తులా ప్రయత్నించాడు. అయినా వ్యవహారం సాగలేదు. లాంచనాల రూపంలో అదనంగా పదివేలయినా ముట్టజెపితేనే గాని 'తాము పెళ్ళికి అంగీకరించేది లేదని వరుని తండ్రి కచ్చితంగా చెప్పేశాడు! కాని కాంతారావు దానికే మాత్రమూ అంగీకరించలేదు. వివాహమైన తరువాత ఎలాగో అలాగ ఆ మిగిలిన అయిదు వేలు ఇచ్చుకోగలనన్నాడు. దానికీ వరుడి తండ్రి ససేమిరా వీల్లేదని మొండికేసుకుని కూర్చున్నాడు. సొమ్మంతా పెళ్ళికి ముందే తన చేతిలో పోసి తీరవలసిందే అంటూ ముక్కు, మూతి బిగించి భీష్మించుకుని కూర్చున్నాడు. ఆ పైన ఒక అర గంటలో ఈ వ్యవహారం తేలకపోతే వెంటనే తిరిగి వెళ్ళిపోగలమని కూడా బెదిరించాడు.

దాని మీద ఉభయపక్షాలవారి మధ్య వాదోపవాదాలు తిట్లు, శాపనార్థాలు కూడా ప్రారంభమయ్యాయి. వరుడి తండ్రి ఆ పరిస్థితిలో తమ వారందరితో కలిసి వెంటనే విడిది ఖాళీ చేసి వెళ్ళిపోయాడు!

అప్పటికప్పుడే శుభముహూర్తం సమయం కూడా దాటిపోయింది. ఆ దారుణ ఘాతంతో సుందరమ్మ నిలువునా నేల మీద కూలబడి ముక్కుతూ మూలుగుతూ బుడ్రిడి దీరాలారంభించింది.

ఆ సమయంలో గోపాలరావు మేనమామనే కాక మేనత్తని కూడా నెమ్మది నెమ్మది ఓదార్చాడు. "డబ్బుకోసం పీక్కుంటి గడ్డి తినే మనుషులని కలలో కూడా అనుకోలేదు!" అంటూ సుందరమ్మ మరింతగా దిగాలుపడి పోయింది.

"ఇంత జరిగాక ఈ రమణికింక పెళ్ళేం కాదు! ఈ పెంటంతా నీ మూలానే వచ్చి పడింది. చేజేతులా చేశావు— అనుభవించు!" అంటూ భార్య మీద విరుచుకుపడ్డాడు కాంతారావు. "తెల్లవారితే నలుగురిలోను నే నింక తల ఎత్తుకుని తిరగలేనండీ!" అంటూ కళ్ళ నీరు పెట్టుకుని మళ్ళీ కుమిలి కుమిలి దుఃఖించసాగింది సుందరమ్మ.

అంతలోనే కాంతారావు మీనాక్షిని సమీపించి చెవిలో ఏదో రహస్యం చెప్పాడు. ఆమె రవంతసేపు ఆలోచించి "నాతో ఏముంది, తమ్ముడూ! నీకెలా తోస్తే అలాగే కానీ! నా అభ్యంతరం ఏమీ లేదు! ఇంతకూ వాడుదీనికి ఒప్పుకుంటాడో!ఒప్పుకోడో!" అంటూ తన సందేహం వెల్లడించింది.

అంతలోనే కాంతారావు అంతర్యంలో ఏదో ఆలోచన స్ఫురించింది. భార్యని దగ్గరకు పిలిచి అతి రహస్యంగా ఒకమాట చెప్పాడు. ఆమె వెంటనే గోపాలరావుని దగ్గరకు పిలిచి, "బాబూ! నువ్వు నాకీ సమయంలో ఈ సాయం చెయ్యాలి! చిన్నప్పటి నుంచీ నేను నీ మనస్సు అనేక విధాల నొప్పించాను. ఈ ఆపత్సమయంలో నువ్వు అవన్నీ మరచిపో

మన అందరి గౌరవము నిలబెట్టాలి'' అంటూ చేతులు రెండు పట్టుకుని ప్రతిమాలసాగింది. కాని, గోపాలరావు దాని కే మాత్రం అంగీకరించలేదు! కాని మేనమామ, మేనత్త, తల్లి అనేక విధాల ప్రతిమాలుకున్న తరువాత ''సరే. మీరంతా ఇలాగ ప్రతిమాలుకుంటు న్నారు కనక చెబుతున్నాను వినండి—నేను దీనికి ఒప్పుకుంటానంటే మాత్రం లాభమేమిటి? రమణి దీనికి అంగీకరిస్తుందో, అంగీకరించదో— ముందా సంగతి నిక్కచ్చిగా తేల్చండి!'' అంటూ నీళ్ళు నమిలాడు. అంతలోనే సుందరమ్మ రమణిని దగ్గరకు పిలిచి విషయం అంతా రహస్యంగా చెవిలో వూదింది.

''నా వాళ్ళనుకున్నవాళ్ళంతా నన్నిలాగ ర్ధరాత్రివేళ నట్టేట్లో ముంచి వెళ్ళిపోయారే! కాస్త నువ్వన్నా మీ నాన్న మర్యాద, నా మర్యాద కాపాడాలే, తల్లీ! లేకపోతే తెల్లవారితే ఇక మేము వీధి ముఖం చూడలేమమ్మా!'' అంటూ కళ్ళ నీళ్ళు పెట్టుకుంది.

రమణి తల వంచుకుని రవంతసేపు ఆలోచించింది.

''అమ్మా! నువ్వు, నాన్నగారు కలిసి ఏది నిర్ణయించినా నాకది అంగీకారమే!''

ఆదే సమయంలో మీనాక్షి తటాలున అడిగింది. ''చూడమ్మా, రమణి! దీనిలో మొహమాటమేదీ లేదమ్మా! పెళ్ళి నూరేళ్ళ పంట! నీకిష్టమైతేనే ఈ వివాహం జరుగుతుంది. లేకపోతే మీ నాన్న ఇంతకన్న గొప్ప సంబంధమే తీసుకు వస్తాడు. అందుచేత బాగా ఆలోచించుకో, అమ్మా! అంతేగాని అనవసరంగా తొందరపడవద్దమ్మా, నీకిష్టమో, కాదో నిక్కచ్చిగా తేల్చి చెప్పమ్మా!''

దాని మీద రమణి వెంటనే అందు కుని, ''నా కీ సంబంధమంటే ఇష్టం! మమ్మాటికీ ఇష్టమే!'' అంటూ కచ్చితంగా తేల్చి చెప్పింది. ఆపైన గోపాలరావుకకి ఆ వివాహానికి అంగీకరించక తప్పలేదు! అంతలో రమణి మొహం పట్టరాని సంతోషంతో కళకళలాడింది.

''ఇది నంగనాచి, వంగముల్లాను మొట్టమొదటి నుంచీ ఇది లోలోపల గోపాలరావు మీదనే మమకారం పెంచు కుంది. కాని అతి గుంభనంగా అది అంతా ఆంతర్యంలోనే దాచివేసుకుంది!'' అంటూ నవ్వింది సుందరమ్మ.

ఈ వ్యవహారం తెలియని పురోహితుడు నిరుత్సాహంతో ఇంటికి తిరిగిపోతూ కాంతారావుని సెలవిప్పించమని అడిగాడు. కాని కాంతారావు— ''వీల్లేదు. పెళ్ళి జరిగి తీరుతుంది. తెల్లవారుజాము ముహూర్తానికే రమణికి, గోపాలరావుకి యథావిధిగా వివాహమహోత్సవం జరి పించండి!'' అని కచ్చితంగా తన నిశ్చయం వెల్లడించాడు.

ఆ వివాహం జరుగుతున్న సమయంలో పెళ్ళికి వచ్చిన పెద్దలు కొందరు వధూవరుల నాశీర్వదిస్తూ, కాంతారావును అభినందిస్తూ, ''బాబూ! ఏమిటేమిటో ఆలోచిస్తుంటాము. కాని చిట్టచివరికి జరిగేదంతా అక్షరాలా ఆ దైవ నిర్ణయమే!'' అంటూ తమ సంతోషం వ్యక్తీకరించారు. ★

# మల్లాది వెంకటకృష్ణమూర్తి మినీ కథ

# ఓ పెన్ కథ




నే పని చేసే ఆఫీస్ హెడ్ ఆప్ ది డిపార్ట్‌మెంట్ బదిలీ అయి వెళ్ళిపోయారు. ఆయన స్థానంలో కొత్త ఆఫీసర్ వచ్చారు. ఆయన రాకకన్నా ముందే ఆయనకు సంబంధించిన ఒక వింత విషయం మాకు చేరింది.

ఆయన బంగారు రంగు కేప్ ఉండే పెన్నుగురించి అది.

ఆయన కోటు జేబులో సదా ఒక పెన్ ఉంటుంది. ఆయన దాన్ని ఉప యోగిస్తుండగా చూసినవారు అరుదు. పొరబాటున కూడా తన పెన్‌ని ఇతరులకి ఇవ్వ డాయన.

ఆ పెన్ అంటే ఆయనకు ప్రాణం.

పాత ఆఫీసర్‌కి వీడ్కోలు, కొత్త ఆఫీసర్‌కి స్వాగతం పలుకుతూ మా ఆఫీస్ రిక్రియేషన్ క్లబ్ ఒక మీటింగ్ ఏర్పాటు చేసింది. అందరి దృష్టి కొత్త ఆఫీసర్ కోటు జేబు మీద పడింది.

బంగారు రంగుతో మెరిసిపోతూ కనపడింది పెన్ కేప్. ఆ పెన్ అంటే ఆయనకి సెంటిమెంటల్ అటాచ్‌మెంట్ ఉందని అనిపించింది నాకు—మనిషి చూడడానికి సెంటిమెంటల్‌గా అని పించడంతో.

వారం రోజులు గడిచాయి. మేం విన్న సంగతి నిజమే అని రూఢి అయింది. ఆయన తన టేబుల్ మీద ఉన్న పెన్ హోల్డర్‌లోని పెన్నులని తప్ప దాన్ని వాడగా ఎవరూ చూడలేదు.

కారణం ఏమై ఉంటుందా అని రకరకాల వూహాగానాలు చేయసాగారు స్టాఫ్ అంతా.

ఆయన యూనివర్సిటీలో గోల్డ్ మెడలిస్ట్. వైస్ చాన్సలర్ స్వయంగా దాన్ని ప్రెజెంట్ చేశారు.

—కాలేజీలో ఉండగా స్వీడిష్ ఎంబసీలోని సెకండ్ సెక్రటరీ కూతురు మెటిల్డాని ప్రేమించాడు. తండ్రికి బదిలీ అయి తన దేశానికి తప్పనిసరిగా వెళ్ళిపోవలసి వచ్చింది మెటిల్డా. అప్పుడు వీడ్కోలు బహుమతిగా ఆ పెన్ ఇచ్చింది. పాతికేళ్ళు గడిచినా ఆయన మెటిల్డాని ఇంకా మరచిపోలేక, ఆమె గుర్తుగా ఆ పెన్‌ని దాచుకున్నాడు. ఆమె ఉత్తరాలు రాయడానికి మాత్రమే ఆ పెన్ ఉపయోగిస్తాడు.

—ఆయనకి అచ్చొచ్చిన పెన్ అది. ఇండియన్ ఆడిట్ అండ్ అక్కౌంట్స్ సర్వీస్ పరీక్ష కూడా ఆ పెన్‌తో రాయటంవల్ల పాసయ్యానని ఆయనకు నమ్మకం. ముఖ్యమైన కాగితాలు మీద సంతకాలకే ఉపయోగిస్తా డది.

ఏది విన్నా నిజమే ననిపిస్తోంది అందరికీ. వదంతులు ఈలాగే మొదలవుతా యనిపించింది ఒక్కొక్కరి వాదన వింటూంటే.

ఆయన పెన్ రహస్యం ఎవరూ ఛేదించలేకపోయారు.

రెండు నెలలు గడిచాయి.

ఒక రోజు ఆయన దగ్గరుండే ప్యూన్ మా సెక్షన్‌లోకి వచ్చి హడావిడిగా చెప్పాడు—

''ఆ పెన్ గురించి తెలిసిందని.''

''ఎలా తెలుసు? అడిగావా?'' అడిగాడు మా సెక్షన్ హెడ్ ఆత్రంగా.

''ఉక్కగా ఉందని కోటు విప్పి కుర్చీకి తగిలించారు. ఆయన ఇందాక బాత్‌రూమ్‌లోకి వెళ్ళగానే పెన్ తీసి చూశాను.''

అందరం అతని మొహంవంక చూశాం—ఏం చెప్తాడా అని.

''ఉట్టి కేప్ మాత్రమే ఉంది. పెన్ పోతే ప్రెస్టిజ్ కోసం కేప్ మాత్రమే పెట్టుకుని తిరుగుతున్నా డాయన.'' ★